
కథ

# అది ఎనభైఆరో నంబరు బస్సు

## కట్న్ని వేంకట కృష్ణారావు



"హాయ్" అన్నాడు ఆ హాండ్సమ్ కుర్రాడు.

'హమ్మయ్య. ఇప్పటికి ధైర్యం వచ్చినట్టుంది ఈ మగమహారాజుకి' అనుకుంది శోభ. సుమారు వారం రోజుల నుంచి తనకు సైట్ కొడ్తున్నాడు మరి. ఈ వారంరోజుల నుంచి తన వెనకే కాళ్లరిగిపోయేలా తిరగడం, కళ్లు వాచిపోయేలా తనవంక 'ఆరాధన'గా చూడడం తప్పించి, పలకరించే వాలకం లేకపోయేసరికి పట్టి చూపులగుర్రమేమో అనుకుంది కూడానూ.

కొద్దిగా బెదురుతూ ముఖం పెట్టి మళ్లీ "హాయ్" అన్నాడా కుర్రాడు. ఈసారి ఆ గొంతులో కొంచెం వణుకు కన్పిస్తోంది.

ఇక తను రెస్పాన్స్ ఇవ్వకపోతే కుర్రాడు జావగారి పోతాడన్పించింది శోభకు. అందులోనూ అంత 'దూసుకుపోయే', 'చొచ్చుకుపోయే' ఈ కాలం కుర్రాడిలా అన్పించడం లేదతను. అందుకే తనకి నచ్చిన ఈ 'అమాయకపు పిల్లాడి' కోసం పెదాలు నెమ్మదిగా కదిల్చి ఓ చిరుమందహాసం కనీ కన్పించనట్లుగా వదిలిందామె.

అతను ధైర్యం పుంజుకున్నట్లుగా కొంచెం ముందుకు, ఆమెకు కొంచెం దగ్గరగా అడుగులు వేశాడు. ఏమైందో మరి అంతలోనే పరుగందుకున్నాడు క్షణాలలో ఆమెను దాటిపోయి వేగంగా, ఇంకా వేగంగా పరుగు తీయసాగాడు.

బిత్తరపోయింది శోభ. అసలు తన రెస్పాన్స్ సరిగా గమనించాడా ఆ కుర్రాడు అనుకుంది ముందు. నోడవుట్. తను నవ్వడం ఖచ్చితంగా అతగాడు చూశాడు. అతని కళ్లల్లో కొత్త ధైర్యం తను స్పష్టంగా గమనించింది కూడా. మరి ఇంతలోనే ఈ పిల్లాడికేమైంది అని అనుకుంటూ అతను పరుగెత్తే వైపు చూసింది. విశేషం ఏమీ లేదు. ఓ నాలుగైదు బస్సులు రైలుపెట్టెల్లా వరసగా కోఠీ వుమెన్స్ కాలేజి రోడ్డు వైపు మలుపు తిరుగుతూ కన్పించాయి. అక్కడ అది అతి సాధారణమైన దృశ్యం. కోఠీ నుంచి వివిధ ప్రాంతాలకు పోయే సిటీ బస్సులు అక్కడ మలుపు తిరిగుతుంటాయి.

మొత్తానికి ఆ రాత్రి శోభకు నిద్ర కరువైంది. 'ఆ అబ్బాయి' ఎందుకలా చేశాడూ... ఇదే ఆలోచన.

మరో రెండు రోజుల తర్వాత...

శోభకు ఆ అబ్బాయి పేరు తెలిసిపోయింది. అతని పేరు సురేష్. కొత్త పోస్టింగొచ్చిన కుర్ర ఇంజనీరు. అతడే చెప్పాడీ వివరాలు. అవును. ఈ రెండురోజుల్లో ఇద్దరికీ పరిచయం కోఠీ వుమెన్స్ కాలేజికి ఎదురుగా ఉన్న చిన్న పార్క్‌లో కూర్చుని జంటగా పల్లీలు తినేంత వరకూ ఏర్పడింది.

పల్లీలు ఒలుస్తూ, తింటూ స్వీట్ నథింగ్స్ మాట్లాడుకుంటున్నారిద్దరూ.

"అబ్బ! ఎంత అందంగా ఉంది" అన్నాడు తన్మయంగా సురేష్.

"ఏమిటి? నీ చేతిలోని పల్లీనా?" అని కిలకిలమంది శోభ.

ఉడుక్కున్నాడు సురేష్ "నేను మాట్లాడుతున్నది విచ్చుతున్న కలువలాంటి నీ ముఖారవిందం గురించి" అన్నాడు ఉక్రోషంగా.

"అలానా! నాకు మాత్రం ఈ పల్లీలు ఎంతో బాగున్నాయి. మరో రెండ్రూపాయలవి కొనవూ" గారాంగా అడిగింది శోభ సురేష్ ముఖంలోకి చూస్తూ.

సురేష్ ముఖం అకస్మాత్తుగా రోడ్డు వైపుకు తిరిగింది. అతను ముఖంలో భావాలు సెకనుకు రెండొందల కిలోమీటర్ల వేగంతో మారిపోయాయి. ఒక్క ఉదుటున లేచి నిల్చుని, పార్కు చుట్టూ ఉన్న గ్రిల్స్ మీంచి హైజంప్ చేసి రోడ్డుమీదకు దూకి వేగంగా, అతి వేగంగా పరుగుతీయసాగాడు.

ఆశ్చర్యంగా చూస్తూ మళ్లీ బిత్తరపోయింది శోభ. కేవలం రెండ్రూపాయల పల్లీలు కొనమంటే మాత్రం ఇలా పారిపోతాడా అనుకుంటూ. రోడ్డు మీద మామూలుగా నాలుగైదు బస్సులు రైలుపెట్టెల్లా ఒకదాని వెనుక ఒకటి అత్యంత క్రమశిక్షణతో పోతున్నాయి.

మరో వారం రోజులు గడిచిపోయాయి. ఆ ఆదివారం మహేశ్వరీ థియేటర్లో ఓ ప్రేమ సినిమా మార్నింగ్ షో చూసి బయటకొచ్చారు శోభ, సురేష్. శోభకా సినిమా బాగా నచ్చింది. ఎంతగా అంటే హృదయానికి హత్తుకుపోయేటంత. ఆ సినిమాలోని హీరోయిన్ పాత్రలో ఆమె లీనమై పోయింది. తానే ఆ హీరోయిన్ అవేటంతగా సురేష్ నడుంమీద చెయ్యివేసి అతని భుజంమీద తన ముఖంతో మృదువుగా తాకుతూ మత్తుగా, ప్రేమలో తలమునకలుగా మునిగిపోయి నడుస్తోంది. ఏమిటేమిటో తియ్యతియ్యని కబుర్లు చెప్పుకుంటున్నారిద్దరూ. ఉన్నట్టుండి "నువ్వు నాకెంతిష్టమో తెల్సా" అన్నాడు సురేష్. కళ్లు అరమూతలుగా తెరుస్తూ "ఎంత? నన్ను పెళ్లి చేసుకునేటంతగానా" అని అడిగింది గోముగా.

ఉన్నట్టుండి మారిపోయింది సురేష్ ప్రవర్తన. గభాల్న ఆమె నొదిలేసి తన నడుం చుట్టూ పెనవేసుకున్న ఆమె చేతిని విదిలించుకుంటూ వేగంగా అతివేగంగా పరుగెత్తుకుంటూ రాంకోఠి నుంచి నారాయణగూడ రోడ్డులోకి మలుపు తిరుగుతున్న ఓ సిటీబస్‌లోకి ఎక్కి అదృశ్యమైపోయాడు. ఆ వెనకే రైలు పెట్టెల్లా మరో నాలుగు బస్సులు అదే మలుపు తిరిగాయి.

శోభకు జుట్టు పీక్కుంటూ, నడిరోడ్డు మీద

కూలబడిపోయి పిచ్చిదానిలా గట్టిగా అరుస్తూ ఏడ్వాలనిపించింది. పరిపరివిధాల కీడు శంకిస్తున్న మనసును అతికష్టంమీద అదుపులోకి తెచ్చుకుంటూ అటుగా పోతున్న ఓ ఆటోని పిలిచి "జూబ్లీ హిల్స్" అంది అందులో కూలబడిపోతూ. ఆ తర్వాత నాలుగు రోజులు వరుసగా కలవలేదు సురేష్. మతిపోతోంది శోభకు. పెళ్లనగానే ముఖం చాటేశాడా సురేష్. అంత అందగాడు, తను మెచ్చినవాడు మోసగాడా? అయినా తన పిచ్చిగాని వల్లీలు కొనమంటేనే పారిపోయినవాడు పెళ్లి వరకూ వస్తాడా? ఈ ఆలోచనలే భరించలేకపోతోంది. రోజురోజుకూ పిచ్చెక్కిపోతోంది. అప్పుడే కాలేజీలో ఆమె ఫ్రెండ్స్‌కి కూడా అనుమానం వచ్చేసింది. గుచ్చి గుచ్చి అడుగుతున్నారందరూ.

అయిదోరోజు కన్పించాడు కాలేజీ వదిలే టైంకు సురేష్ హీరోహోండా మీద సుఖాశీనుడై. శోభను చూడగానే చిరునవ్వుల జల్లులు కురిపించాడు చిలిపిగా కన్నుగీటుతూ.

కక్షగా చూసిందతని వంక శోభ. పెళ్లిమాట ఎత్తేసరికి పత్తా లేకుండా పోయాడు మగాడు. తను ఆ విషయం మర్చిపోయిందనుకుని కాబోలు మళ్లీ వచ్చాడు. ఇంకా నయం తను ఈ వంచకుడి వలలో పడకుండా తప్పించుకోగల్గింది, ఆ దేవుడి దయవల్ల. మళ్లీ ఈ మోసగాడి మాయలో పడకూడదు గట్టిగా నిర్ణయించుకుని అతన్ని చూడనట్లుగానే పక్కనుంచి ఆటోస్టాండ్‌వైపు నడక సాగించింది.

"శోభా!" మెల్లిగా పిలిచాడు సురేష్.

విననట్టుగానే ముందుకు కదిలిందామె.

బండి స్టార్ట్ చేసి ఆమె పక్కగా వచ్చాడు సురేష్. మళ్లీ పిలిచాడు కాస్త పెద్దగా. అతనికి ఆశ్చర్యంగా ఉంది. తనని చూడగానే ఎంతో ఆనందిస్తుందనుకున్న శోభ ఎందుకిలా చేస్తోంది అనుకుంటూ మళ్లీ పిలిచాడు కాదు అరిచాడు. నడుస్తున్నది ఆగి గిరుక్కున అతనివైపు తిరుగుతూనే కాళికలా అరిచింది శోభ, "దయచేసి నాతో మాట్లాడకు. వెళ్లు, వెళ్లిపో" అంటూ.

బిత్తరపోయాడు సురేష్. శోభ పక్కన నడుస్తున్న ఆడపిల్లలు ఏం జరిగిందోనని ఆ ఇద్దరివంకా కుతూహలంగా చూస్తున్నారు. ఆ దృశ్యం మంచి స్టిల్‌లా కన్పిస్తోంది. హఠాత్తుగా అటు చూసినవారికి.

ఏమనుకున్నాడో సురేష్ ఉన్నట్లుండి గభాల్న శోభ చెయ్యి పట్టుకుని వెనక కూర్చోబెట్టుకుని వేగంగా, అతివేగంగా బండిమీద దూసుకుపోయాడు. ఇప్పుడు అక్కడ చేరిన జనం ఆశ్చర్యంగా బిత్తరపోతూ... అలానే చూస్తున్నారు. అప్పుడే అతి మామూలుగా ఇంకేదీ పట్టనట్టు ఓ నాలుగైదు బస్సులు ఉమెన్స్ కాలేజీకి ఎదురుగా మలుపు తిరుగుతున్నాయి రాంకోఠివైపు.

ఆ బస్సులన్నింటికీ ఒకే నంబరుంది. అది '86'.

అవును. కోఠీ నుంచి రాంనగర్ మీదుగా సికింద్రాబాదు పోయే '86' నంబరు సిటీబస్సులవి.

ఖచ్చితంగా మరో పదినిమిషాల తర్వాత టాంక్‌బండ్ మీద బుద్ధుడి ఎదురుగా ఉన్న ఓ సిమెంట్ బెంచీ మీద ఉన్నారు సురేష్, శోభ.

శోభ కళ్ల వెంట నీళ్లు...

సురేష్ ముఖంలో ఎంతో రిలీఫ్!

అతనంటున్నాడు "ఓస్ అసలు సంగతి ఇదా నేనింకా ఏమేమో అనుకున్నాను. అలా ఉన్నట్టుండి నేను హఠాత్తుగా వెళ్లిపోవడంతో ఏవేవో అర్థాలు తీసుకున్నావన్న మాట. నేనుండేది రాంనగర్‌లో తెలుసుగా. అయితే నువ్వుండేది జూబ్లీహిల్స్‌లో. కనుక రాంనగర్ వాసుల కష్టాలు నీకు తెలియవు. నువ్వు కాలేజీకి వచ్చి పోయేది ఆటోల్లో కనుక సిటీబస్సుల్లో తిరుగాడే నాలాంటి వాళ్ల బాధలూ తెలియవు. రాంనగర్‌కి కోఠీ నుంచి పోవాలంటే '86'వ నంబరు బస్సెక్కటే పెద్ద దిక్కు. ఆ '86'వ నంబరు బస్సెప్పుడూ ఒంటరిగా రాదు. ఆ నంబరువి నాలుగైదు బస్సులు కలిసి వస్తుంటాయి. అలా అవి ఒకేసారి వచ్చినా జనం 15 బస్సులకి సరిపడా ఉంటారనుకో. ఒకసారి ఆ బస్సుల వరసపోతే మళ్లీ గంటా, గంటన్నరవరకూ బస్సుండదు. అంతవరకూ నిలువుకాళ్ల జీతమే. అంతసేపు నిల్చున్నా బస్సులో సీటు దొరకదు. అందుకే కోఠీ నుంచి రాంనగర్ పోయే వాళ్లకి ఆ బస్సు కన్పిస్తే చాలు మరో ఆలోచనే రాదు. ఆ బస్సెక్కే వరకూ ప్రశాంతత ఉండదు. అసలారోజు థియేటర్ దగ్గర నువ్వు మన పెళ్లి గురించి మాట్లాడిన మాట కూడా నేను వినలేదు తెలుసా. ఇంతకీ ప్రేమించిన పిల్లతో మైమరచి కులాసాగా కాసేపు కబుర్లు చెప్పుకోలేని ఈ బతుకు మీద విరక్తి పుట్టి మొన్న ఆదివారం మా ఊరికి పోయి మానాన్నగారు వాడుతున్న ఈ బండి తీసుకువచ్చేశాను. ఇక మన విహారాలకు ఆకాశమే హద్దు" గర్వంగా చెప్పాడు సురేష్ మురిపంగా ఎదురుగా పార్క్ చేసివున్న హీరోహోండా వంక చూస్తూ.

అనుమానాల మేఘాలన్నీ తొలిగిపోగా ప్రకాశవంతమైంది శోభ ముఖం. గారం గుడుస్తూ అతని ఒళ్లో వారిపోయి, అతని కళ్లలో కళ్లు కలిపింది.

"అసలొకందుకు ఆ '86' నంబరు బస్సుకు మనం కృతజ్ఞతలు చెప్పుకోవాలి తెల్సా" అన్నాడు సురేష్.

ప్రశ్నార్థకంగా చూసింది శోభ.

"అసలు మాఆఫీసు నుంచి కోఠి వరకు నడిచొచ్చి కోఠీ దగ్గర ఈ బస్సెక్కేవాణ్ణి. అయితే ఒక్కరోజూ సీటు దొరికేది కాదు. ఇక ఇలా కాదని సికింద్రాబాదు నుంచి వచ్చి కోఠీ ఉమెన్స్ కాలేజీ దగ్గర టర్న్ అవుతుండగా రన్నింగ్ పొజిషన్‌లో ఆ బస్ ఎక్కి సీటు సంపాదించుకోవడం ప్రారంభించా. అందుకే ఉమెన్స్ కాలేజీ ఎదుటే ప్రదక్షణలు చేసేవాడిని. అలా ప్రదక్షణలు చేస్తుంటేనే నువ్వు నాకంట పడ్డావు. నా ప్రేమ అంగీకరించావు. అందుకే '86'వ నంబరు సిటీ బస్సుకి నేను జీవితాంతం కృతజ్ఞుడిగా ఉండాల్సిందే'

"అలాగా! అయితే బస్టాపులో సిటీబస్సొచ్చేంతవరకూ ఉండే ఖాళీ సమయంలో ప్రేమించిన ప్రేమన్నమాట నీది" బుంగమూతి పెట్టింది శోభ.

ఇక మీ ప్రేమకు ఏ ప్రమాదమూ లేదన్నట్టు టాంక్‌బండ్ మీది లైట్ల వెలుగుతో తళతళా మెరుస్తూ హుందాగా చూస్తోంది హీరోహోండా! ■

